క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

గోకవరం: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై ఆదివారం స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట రాంజీలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్ అందజేత



గ్రంథాలయానికి మెటీరియల్ అందజేస్తున్న కిరీటి, తదితరులు

ఏలేశ్వరం: పట్టణంలోని గ్రంథాలయానికి శనివారం దాతలు స్టడీ మెటీరియల్ అందజేశారు. పట్టణానికి చెందిన విశ్వహిందూ పరిషత్ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇందిరాప్రియదర్శిని కొనుగోలు చేసిన ఐఏఎస్ స్టడీ మెటీరియల్‌ను మండల కార్యదర్శి కటకం కిరిటీ లైబ్రేరియన్ కె.సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా కిరీటి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయానికి ఐఏఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్టు తెలిపారు.

లోవ భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తులు లోవదేవస్థానానికి చేరుకోవడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మా ట్లాడారు. నేడు ఆషాఢ మాసంలో చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు, భక్తులు లోవదేవస్థానానికి తరలివచ్చే అవకాశం ఉందన్నారు. 10 వేలకు పైగా ప్రత్యేక వాహనాలు, లక్ష మంది వరకూ భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండ చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా లోవ దేవస్థానికి వెళ్లే వాహనాలు జాతీయ రహదారి మీదుగా జగన్నాథగిరి చేరుకుని లోవకొత్తూరు, లోవదేవస్థానానికి వెళ్లాలన్నారు. లోవ నుంచి తి రుగుప్రయాణంలో ఆర్చి గేటు నుంచి కుడి చేతి వైపు మలుపు తిరిగి సీతయ్యపేట, రాజుపేట మీ దగా చేపూరు వద్ద జాతీయ రహదారి పైకి వెళ్లాలన్నారు. వన్ వే విధానాన్ని వాహనదారులు, భక్తులు పాటించాలన్నారు.

వైభవంగా మరిడమ్మ జాతర

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ అమ్మవారి జాతర శనివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని మెయిన్ రోడ్‌ను ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయం వద్ద లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతరలో గరగ నృత్యం, తీన్‌మార్, శక్తివేషాలు, విచిత్ర వేషధారణలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బాణసంచా కాల్చారు. తీన్‌మార్, శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. తొలుత అమ్మవారి ఆలయం నుంచి మెయిన్‌రోడ్, బాలాజీచౌక్, నర్సీపట్నంరోడ్, దిబ్బలపాలెం మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తీర్థంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

23న కౌన్సెలింగ్

తుని: పాయకరావుపేట గవర్నమెంట్ ఐటీఐలో అడ్మిషన్లకు ఈ నెల 21న జరగాల్సిన కౌన్సెలింగ్‌ను 23వ తేదీకి మార్చినట్లు ప్రిన్సిపల్ కె. సత్యన్నారాయణ శనివారం తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం ఉదయం 8 గంటలకు పాయకరావుపేట ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

మొక్కలు నాటాలి

ఏలేశ్వరం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు గోళ్ల నాగేశ్వరరావు అన్నారు. బాలాజీచౌక్ ధర్మకర్త గోపు వెంకట్రావు జ్ఞాపకార్థం సిరిపుడ్స్ కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అనసూరి నాగేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణ, గోపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 20 మంది ఎంపిక

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా విద్యాసంస్థల ఆవరణలో దివిస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో మినర్వా పూర్వ విద్యార్థులు, ఇతరులు 55 మంది పాల్గొన్నారు. వీరికి పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 20 మంది ఉద్యోగాలకు అర్హత సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు.

వంచన బాబుకు అలవాటే

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ తోట నరసింహం
- వీరవరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై విస్తృతస్థాయి సమావేశం





పార్టీ శ్రేణులతో కలసి క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తోట నరసింహం, సభకు హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కిర్లంపూడి: బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో ఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. వీరవరంలోని తోట నరసింహం నివాసంలో శనివారం వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి నూరుశాతం హామీలను ఏడాదిలోనే అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ఇచ్చిన హామీల్లో పింఛన్ తప్ప అన్నింటినీ ఎగ్గొట్టిందని విమర్శించారు.

సాకులతో..

తల్లికి వందనం పథకాన్ని పలు సాకులు చూపించి ఎందరో లబ్ధిదారులకు ఎగ్గొట్టారని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు, 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, లేకుంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి తదితర హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని ఎక్కడ అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.

కరెంట్ బిల్లులతో షాక్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంట్ బిల్లులు షాక్ కొడుతున్నాయని విమర్శించారు. ఏడాది కాలంలోనే రూ.16 వేల కోట్లు లాగేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఒక్కటే ప్రామాణికంగా అందరికీ ప్రభుత్వ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామాల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ప్రభుత్వ మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ, పార్టీ మండల అధ్యక్షుడు పెనగంటి రాజేష్, పార్టీ సీనియర్ నాయకులు తోట బాబ్జీ, వలంటీర్స్ విభాగం జాయింట్ సెక్రటరీ తోట అయ్యన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి రామచంద్రమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి కరుటూరి శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ వరుపుల సూరిబాబు, అడారి రాజబాబు, ఓలేటి రాజేశ్వరరావు, పాతంశెట్టి కృష్ణమూర్తి, నకిరెడ్డి సుధాకర్, బల్ల కామేశ్వరావు, వేగి రామకృష్ణ, తోట వేణుగోపాలరావు(వేణు), పాముల చంటి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రాజా పరామర్శ



ఎర్రకోనేరులో వెంకటేశ్వరరావు, భద్రరావులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: మండలం వల్లూరు, ఎర్రకోనేరు గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. వల్లూరులో ఇటీవల మృతి చెందిన తుని చెక్కల మార్కెట్ వ్యవస్థాపకుడు కుర్ర వెంకటన్న చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. తేటగుంట శివారు ఎర్రకోనేరులో మాతృ వియోగంతో బాధపడుతున్న పప్పు వెంకటేశ్వరరావు, భద్రరావులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ అత్తి నాగరాజు, నాయకులు కుర్ర బాబ్జి, చోడ్రాజు రాజబాబురాజు, పేరూరి భద్రినారాయణ, గణేసుల వీరబాబు, రేలంగి రమణగౌడ్, నాగం దొరబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం



నీలాద్రిరావుపేట గాంధీ విగ్రహం వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ప్రత్తిపాడు: మండలంలో శనివారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించినప్పటికీ ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో వర్షం కురిసింది.

గండేపల్లి: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో శనివారం మండలంలో ఈదురు గాలులతో వర్ష కురిసింది. గత కొన్ని రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు ఉండటంతో ఆపసోపాలు పడ్డ ప్రజలు వర్షం ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది.

రహదారులు జలమయం

గండేపల్లి: మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. నీరు పోయే మార్గాలు ఆక్రమణలకు గురికావడంతో పల్లపు ప్రాంతాల నుంచి నీరు రోడ్లను ముంచెత్తింది. నీలాద్రిరావుపేట గాంధీ విగ్రహం ఉన్న వీధిలో నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో కాలనీవాసులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వెళుతున్న విద్యార్థులు నీటిలోంచి వేళ్లేందుకు అవస్థలు పడ్డారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పలు చోట్ల డ్రైన్లు ఆక్రమణలకు గురికావడంతో నీరు రోడ్లపై నిచిపోతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా లలితకుమారి



ప్రిన్సిపాల్ లలిత కుమారికి స్వాగతం పలుకుతున్న అధ్యాపక సిబ్బంది

జగ్గంపేట: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జీవీ లలిత కుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన రాజ కుమారి కాకినాడ మండలం చొల్లంగి గురుకుల పాఠశాలకు బదిలీ అయ్యారు. నూతన ప్రిన్సిపాల్ లలిత కుమారికి పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

‘ఉపాధి హామీ’ని రైతులకు అనుసంధానం చేయాలి



ప్రత్తిపాడు ఏపీఓ కుమారస్వామికి వినతిపత్రం అందిస్తున్న బీకేఎస్ జిల్లా ప్రతినిధులు

ప్రత్తిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతాంగానికి అనుసంధానం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులోని వివేకవర్ధిని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో శనివారం సాయంత్రం బీకేఎస్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఈ పథకం కింద సాగునీటి చెరువులు, పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. వర్షాభావంతో నారుమళ్లు ఎండిపోతున్న నేపథ్యంలో పంట కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో అధికారులు స్పందించకపోవడం వల్ల వెంకన్నదొర చెరువు ఆయకట్టు కింద రైతులు ఎకరాకు రూ.400 వంతున చందాలు వేసుకుని, పంట కాలువలను బాగు చేసుకున్నారన్నారు. అనంతరం పెదశంకర్లపూడిలో జరిగిన ఉపాధి పనులపై విచారణ చేయాలని కోరుతూ ప్రత్తిపాడు ఏపీఓ కుమారస్వామికి బీకేఎస్ జిల్లా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి ఆకుల హరిబాబు, పెదిరెడ్ల గంగారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం అక్విడెక్టు పనుల పరిశీలన

తుని రూరల్: తుని సమీపంలో తాండవ నదిపై నిర్మిస్తున్న పోలవరం ఎడమ ప్రధాన కాలువ అక్విడెక్టు పనులను జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. శనివారం సాయంత్రం తుని వచ్చిన ఆయన తాండవ ఫ్యాక్టరీ సమీపంలో అక్విడెక్టు పనులు పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈఈ గోవిందు జరుగుతున్న పనులు, జరగాల్సిన పనులను వివరించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను మంత్రి ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు



ధర్మవరంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఆయన శనివారం పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, రెండు కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గుడాల తమ్మారావు ఇటీవల పాము కాటుకు గురై ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దడాల సత్తిబాబు ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. ఆయా కుటుంబాలను ముదునూరి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మరో మూడు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ముచ్చర్ల దాసు, ముచ్చర్ల రాజు, కోలా తాతబాబు, తూపాటి బాబ్జి, గుమ్మిడి రామకృష్ణ, నల్ల వెంకటేష్, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఫ్యాన్ల బహూకరణ

తుని: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌కు తుని–పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు బహూకరించారు. హాస్టల్‌లో ఫ్యాన్లు లేక ఎండ తీవ్రతతో బాలికలు ఇబ్బంది పడుతున్నారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యకుమారి రెడ్డి సంక్షేమ సంఘం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సంఘ ప్రతినిధులు నాలుగు ఫ్యాన్లు, ఐదు ట్యూబ్‌లైట్లను శనివారం హాస్టల్ అధికారి సత్యకుమారికి అందజేశారు. ప్రజాసేవకు సంఘం అన్ని వేళలా కృషి చేస్తుందని సంఘ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనల నడుమ సత్రం భూముల కౌలు వేలం



ఆలయం గేటు వద్ద రైతులను నెడుతున్న ఎస్సై జగన్మోహన్‌రావు, పోలీసు సిబ్బంది

తొండంగి: పోలీసుల పహారా, రైతుల ఆందోళనల నడుమ పిఠాపుం శ్రీసంస్థానసత్రం భూముల కౌలు వేలం ప్రక్రియను అధికారులు మొక్కుబడి తంతుగా ముగించారు. శ్రీసంస్థనం సత్రానికి చెందిన తొండంగిలోని 478.46 ఎకరాల భూమికి 175 బిట్లుగా ఈ నెల 14 నుంచి 19 వరకూ దేవదాయధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారులు, సంస్థాన సిబ్బంది కౌలు వేలం ప్రక్రియ నిర్వహించారు. కాగా శనివారం ఆరో విడతగా 25 బిట్లుగా 58.20 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించగా రూ.5,14,500 ఆదాయం వచ్చింది. గతంలో ఈ భూములకు రూ.476900 రాగా ఈసారి రూ.37600 పెరిగిందని శ్రీసంస్థానం ఈవో నున్న శ్రీరాములు తెలిపారు. కాగా శనివారం రైతులు కొంతమందిని వేలానికి హాజరు కానివ్వకుండా ఆలయం బయట గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ప్రశ్నించిన రైతులను వేలం ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారంటూ ఎస్సై జగన్మోహన్ రావు నెట్టివేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు కూటమి పార్టీ నేతలకు వత్తాసు పలుకుతూ కౌలు వేలం మొక్కుబడి తంతుగా నిర్వహించారని రైతులు విమర్శించారు. అధికారులు, పోలీసులు తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ రైతులు ఆందోళన చేశారు.

బాలుర వసతి గృహంలో తనిఖీలు



ప్రత్తిపాడు ఎస్సీ బాలుర హాస్టల్‌లో తనిఖీలు చేస్తున్న న్యాయమూర్తి గోపీనాథ్

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహం పరిసరాలు, వంటగది, స్నానపు గదులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు దోమతెరలు ఉన్నాయా ? 10వ తరగతి విద్యార్థుల కోసం నియమించిన ట్యూటర్లు వస్తున్నారా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, తినే ఆహార పదార్థాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎం.సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్ సందర్శన

మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి గోపీనాథ్ ప్రత్తిపాడు ఉప కారాగారాన్ని (సబ్ జైల్) శనివారం సాయంత్రం సందర్శించారు. ఉప కారాగారంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఫిర్యాదుల పెట్టెను తెరిచి చూశారు. సీసీ కెమెరాల పనితీరును జైలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలతో కాస్సేపు ముచ్చటించారు. ఆయన వెంట ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, సబ్ జైలు సిబ్బంది తదితరులున్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



కోటనందూరు ఎంపీడీఓ కార్యాలయంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు

కోటనందూరు: పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది చీపుర్లు చేతబట్టి ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నారాయణ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ప్రజలు పంచాయతీ అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి భూమిని కాపాడాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల సిబ్బందితో కలిసి పరిశుభ్రత, ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్లాస్టిక్ వినియోగం అనర్థం

ప్రత్తిపాడు: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి అనర్థమని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య మైకేల్ అన్నారు. ప్రత్తిపాడులో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు. సీహెచ్‌సీ ఆవరణలో వైద్యులు, నర్సులు, సిబ్బంది సుమారు 80 మొక్కలను నాటారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏడిద రెడ్డినాయుడు, వివేకానంద ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి, రాజపూడి గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. రాజపూడిలో ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను ఉపయోగించడం మానుకోవాలన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కాట్రావులపల్లిలో గ్రామ సర్పంచి పిట్టా సుగుణరావు ఆధ్వర్యంలో ప్లాసిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బూసాల విష్ణు, రాజపూడి సొసైటీ అధ్యక్షులు బుల్లబ్బు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి

గోకవరం: ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గోకవరం ప్రభుత్వాస్పత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ రామలక్ష్మి అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సిబ్బంది, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆస్పత్రి పరిసరాలను శుభ్రపరిచి మొక్కలు నాటారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాస్‌రావు, అల్లాడ అరుణ, పిట్టా అరుణ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి పుస్తకాల అందజేత

ప్రత్తిపాడు: స్థానిక ప్రగతి కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ (ఎంపీసీ) చదువుతున్న విద్యార్థినికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ రూ.8,500 విలువైన పుస్తకాలను శనివారం అందజేశారు. మండలంలోని ఉత్తరకంచి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గున్నాబత్తుల రాజబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాజబాబు కుమార్తె కృష్ణాంజలి స్థానిక ప్రగతి కళాశాలలో చదువుతోంది. ఆమె చదువు నిమిత్తం రామ్‌కుమార్ తన సొంత నిధులతో పుస్తకాలను కొనుగోలు చేసి ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనుబాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు, దొడ్డిపట్ల సుబ్బరాజు, కడారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో బ్యాంక్ ఆఫ్ బరోడా పాత్ర కీలకం

తుని: ప్రజల ఆర్థికాభివృద్ధిలో బ్యాంక్ ఆఫ్ బరోడా కీలక పాత్ర పోషిస్తోందని ఆ బ్యాంకు తుని శాఖ సీనియర్ మేనేజర్ గుడివాడ సురేంద్రకుమార్ నాయుడు అన్నారు. తునిలో శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్యాంకు వ్యవస్థాపకులు రాజా షాయాజీ రావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ నాయుడు మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.24 లక్షల కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా నిలిచిందన్నారు. దేశ వ్యాప్తంగా 8500 శాఖలతో లావాదేవీలు నిర్వహిస్తుందని, తుని శాఖ రూ.200 కోట్లు టర్నోవర్ కలిగి ఉందన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పి.అరుణకుమారి, క్రెడెట్ అధికారి నవీన్ సాగర్, సీనియర్ అసిస్టెంట్ కోటేష్, సత్యానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: నియోజకవర్గ ప్రజలు, రైతాంగానికి కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధికారులకు సూచించారు. మండలంలోని పెదశంకర్లపూడి క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి విద్యుత్ శాఖాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు నివాస గృహాలు విస్తరించాయని, ఆయా ప్రాంతాలకు విద్యుత్ లైన్లు పొడిగించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి, వాటి స్థానే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై అధికారులతో సమీక్షించారు. అలాగే ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.80 వేలతో ఆధునీకరించిన తరగతి గదిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ప్రసాదరావు, ఏడీఈ ఎం. రాజశేఖరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఏఈలు ఎ.శ్రీను, జి.సూర్యనారాయణ, శంఖవరం, రౌతులపూడి ఇన్‌చార్జి ఏఈలు బి.కుమార్, జి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యుడు సందీప్ అన్నారు. మండలంలోని అచ్చంపేటలో ప్రజలకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదన్నారు.

క్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.